

ముగ్గురు ట్రిపుల్ ఐటి విద్యార్థులకు రిమాండ్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లోని ముగ్గురు ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులకు కోర్టు రిమాండ్ విధించినట్లు జె.ఆర్ పురం సిఐ అవతారాం, ఎచ్చెర్ల ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. క్యాంపస్‌లో ఈనెల 12వ తేదీన ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.సుజన్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీనియర్ విద్యార్థుల వేధింపుల వల్లే మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఎనిమిది మంది విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. డిఎస్‌పి వివేకానంద ఆధ్వర్యాన సమగ్ర దర్యాప్తు అనంతరం ముగ్గురు విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించి అరెస్టు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మద్దతు ధర గ్యారంటీ చట్టం అమలు చేయాలి
- అఖిలపక్ష కార్మిక, రైతుసంఘాల డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్న కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కార్మికవర్గాన్ని కార్పొరేట్లకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష కార్మిక, రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ, రైతులు పండించే అన్ని పంటలకు C2+50% హామీ కొనుగోలుతో మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికవర్గం ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి అమలు చేయడానికి ఆదేశాలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. యాజమాన్యాల దోపిడీకి రహదారులను మోడీ ప్రభుత్వం సిద్ధం చేస్తోందని విమర్శించారు. పర్మినెంట్, కాంట్రాక్టు పద్ధతి స్థానంలో పరిమితకాల ఉద్యోగం పద్ధతి తెచ్చారని తెలిపారు. కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కనీస సభ్యుల సంఖ్యను పెంచడం, నిరసనలు, ధర్నాలు నిర్వహించడానికి అనుమతులను తప్పనిసరి చేయడం, పని ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు పరిహారాన్ని యాజమాన్యాల ఇష్టానుసారానికి వదిలివేయడం, కలిసికట్టుగా తెలిపే నిరసనను నేరపూరితంగా పరిగణించడం వంటివి ప్రతిపాదిత లేబర్ కోడ్స్‌లో పొందుపరిచి కార్మికుల హక్కులకు చరమగీతం పాడారని విమర్శించారు. కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చుకోవడానికి ఉన్న శక్తివంతమైన సమ్మె హక్కును నిర్వీర్యం చేసి, దాన్ని అసాధ్యం చేసేలా మార్పులు చేస్తూ చట్టం మార్చారని చెప్పారు. యాజమాన్యాల దయా దాక్షిణ్యాలపై కార్మికులు ఆధారపడాలి తప్ప జీతాలు పెంచాలని పోరాటాలు నిర్వహించలేని పరిస్థితులు ఉండేలా లేబర్ కోడ్స్ ఉన్నాయన్నారు.

2020 నవంబర్ 26న ఢిల్లీ సరిహద్దుల వద్ద ప్రారంభమైన చారిత్రాత్మక రైతు పోరాటంతో మూడు కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందన్నారు. ఆ సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, రైతుల ఆర్థిక భద్రతను మరింత దెబ్బతీసే విధానాలను అమలు చేసి, వ్యవసాయ స్వావలంబన, దేశ ఆహార భద్రతను బలహీనపరిచిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన రైతుల ఆదాయం రెట్టింపు హామీ పూర్తిగా విఫలమైందన్నారు. 2025-26 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,369 రైతులకు దక్కడం లేదని తెలిపారు. అనంతరం లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొందూరు చంద్రరావు, పోలాకి ప్రసాదరావు, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు చిక్కాల గోవిందరావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎస్.కష్ణవేణి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ కిసాన్ కాంగ్రెస్ నాయుకులు సనపల అన్నాజిరావు, ఎపి మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.వాసుదేవరావు, ఉద్యోగ, కార్మిక, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.



పలాస : ధర్నా చేస్తున్న కార్మిక, రైతుసంఘాల నాయకులు

ఎచ్చెర్ల : మండలంలోని అరిణాం అక్కివలస వద్ద గల నాగార్జున అగ్రికమ్ పరిశ్రమ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నాగార్జున అగ్రికమ్ యూనియన్ నాయకులు ఎ.సత్యనారాయణ, ఎల్.రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని వరిశాంలో గల శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమ వద్ద, పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు ధర్నాలు చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, శ్యాంక్రగ్‌పిస్టన్స్ అండ్ రింగ్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు జీరు రాము, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.


పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద అఖిల భారత కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, రైతుసంఘం నాయకులు టి.అజయ్ కుమార్, సిపిఐ నాయకులు లండ వెంకటరావు, ఎఐసిసిటియు నాయకులు పి.నాగేశ్వరావు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : నిరసన తెలుపుతున్న కార్మికులు



రణస్థలం : నిరసన తెలుపుతున్న కార్మికులు



రామేశ్వరంలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు జిల్లావాసులు మృతి



సాయి కుమార్



నవీన్

వార్త... మెయిన్ పేజీలో



ధర్నా చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీలు

ఉద్యోగోన్నతులు కల్పించాలి

గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల నిరవధిక ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వార్డు, గ్రామ హెల్త్ సెక్రటరీలకు ఎఎన్ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.సాయిప్రసాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన హెల్త్ సెక్రటరీలు నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ ఇచ్చినా ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే నేటికీ ఉద్యోగోన్నతులు ఇవ్వలేదన్నారు. జిఒ విడుదలై సంవత్సరం పూర్తయినా వైద్యారోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం కారణంగా ఈ ప్రక్రియను పూర్తి చేయలేదని విమర్శించారు. జిల్లాలో 150 ఖాళీలు ఉన్నాయని, వెంటనే ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగోన్నతులు ఇచ్చే వరకు నిరవధిక ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు డి.వాసు, విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.ఝాన్సీ, నాయకులు పద్మప్రియ, మాధవి, అరుణ, రమ, హేమలత, జీవిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి, టెక్కలిలోని రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొత్తమ్మతల్లి ఆలయానికి రూ.ఐదు కోట్లు, రావివలస ఆలయానికి రూ.మూడు కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. త్వరలోనే టెండర్లు పిలిచి ఖరారు చేసి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.



వర్సిటీ పరిపాలనా భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సుమారు రూ.38 కోట్లతో నిర్మించిన డాక్టర్ ఎన్‌టిఆర్ పరిపాలనా భవనాన్ని వర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని బుధవారం ప్రారంభించారు. పలు శాఖలకు కేటాయించిన గదులనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన భవనం ప్రారంభంతో వర్సిటీకి పాలనాపరమైన వసతి సమస్య దాదాపుగా తీరినట్లయిందన్నారు. కొద్దిరోజుల్లో వర్సిటీ ముఖ్య కార్యాలయాలన్నీ నూతన భవనం నుంచి పరిపాలన చేస్తాయని తెలిపారు. గత వైస్ ఛాన్సలర్లు కె.రామ్‌జీ, ఎన్.వెంకటరావు కృషికి తోడు ప్రస్తుత వర్సిటీ ఉన్నతాధికారులు అవిశ్రాంత ప్రయత్నంతో ఈ భవనం పూర్తి చేసుకుందని చెప్పారు. అనంతరం నిర్వహించిన రాజ్యాంగ, న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు, న్యాయ విభాగం అధ్యాపకులకు జ్ఞాపికలను విసి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ఇసి సభ్యులు కె.చక్రపతి, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం.అనురాధ, కె.స్వప్నవాహిని, సిహెచ్.రాజశేఖరరావు, ఎస్ఒ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

వరకట్న వేధింపులకు కఠిన శిక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

వరకట్నం కోసం మహిళలను వేధించిన వారికి కఠిన శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు స్పష్టం చేశారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో వరకట్న నివారణపై మహిళా పోలీసు అధికారులకు బుధవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరకట్న వేధింపులకు గురైన బాధితులు, నిందితులు ఇద్దరినీ స్థానిక న్యాయ సేవాధికార సంస్థలో ప్రవేశపెట్టి, కౌన్సెలింగ్ ద్వారా సమస్యను పరిష్కరించడానికి మార్గం ఉందన్నారు. కార్యక్రమంలో దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.నారీమణి, న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, మహిళా పోలీసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

29 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి గంజాయి రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పటాపూర్‌కు చెందిన సంజుక్త దాస్, లోక్‌నాథ్ ప్రదాన్‌ను అరెస్టు చేసినట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. వారి నుంచి 29 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక సిఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సంజుక్త దాస్ తన భర్త మరణం తర్వాత ఆర్థిక సమస్యల కారణంగా గంజాయి వ్యాపారంలోకి ప్రవేశించిందని తెలిపారు. సంజుక్త దాస్ గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో పాండెసర ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో తన భర్త స్నేహితుడు, గంజాయి వ్యాపారం చేసే రంజాన్ ప్రదాన్, గంజాయి సరఫరాదారు కునిపండాతో పరిచయం ఏర్పడిందన్నారు. పలుమార్లు కునిపండా వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, సూరత్‌కు తీసుకెళ్లి రంజాన్ ప్రదాన్‌కు విక్రయించేదని వివరించారు. రంజాన్ ప్రదాన్ ఆర్డర్ మేరకు 29 కిలోల గంజాయిని సూరత్‌కు తరలించి అందించేందుకు, సంజుక్త దాస్, లోక్‌నాథ్ ప్రదాన్ ఇచ్ఛాపురంలో రైలు ఎక్కేందుకు వచ్చారని తెలిపారు. రైల్వేస్టేషన్ వద్ద ఇన్‌ఛార్జి ఎస్ఐ వి.రవివర్మ వాహనాలు తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరినీ తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందని తెలిపారు. గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం పునాది

ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి పునాది అని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిన రోజు అని తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతత్వం వంటి విలువలతో నిండిన రాజ్యాంగాన్ని రూపొందించిన బి.ఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయని కొనియాడారు. ప్రజల హక్కుల పరిరక్షణలో, చట్ట పాలనను నిలబెట్టడంలో పోలీసులు రాజ్యాంగ స్ఫూర్తిని తమ పనితీరులో అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్.గోపీనాథ్, డిఎస్‌పి శేషాద్రి, ఆర్ఐ నరసింగరావు, సిఐ దేముళ్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఆహార నాణ్యతలో రాజీ లేదు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మెస్‌లో ఆహార నాణ్యతలో రాజీ లేదని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో 'మెస్ ఆఫీసు సేవలు - విద్యార్థుల ఆరోగ్యానికి మా కృషి' నినాదంతో బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి మెస్‌లో భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఆహారంతో విద్యార్థులకు ఇంటి భోజనాన్ని గుర్తు చేసే అనుభూతి కలుగుతుందన్నారు. మెస్ నిర్వహణలో విద్యార్థుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు మెస్ ఆఫీసు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నవీకరణలు చేపట్టాలని సూచించారు. పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యమే తమ ప్రాధాన్యత అని అన్నారు. మెస్ వ్యవహారాల్లో ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీన్ శివరామకృష్ణ, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, క్యాంపస్-2 ఇన్‌ఛార్జి సాగర్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్‌ఒలపై 'రియల్' వ్యాపారి దాడి

ప్రజాశక్తి - పలాస

పలాస తహశీల్దార్ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కంబిరిగాం, లక్ష్మీపురం, చినంచల విఆర్‌ఒలు వెంకటరావు, వెంకటరమణ, చంద్రమోహన్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారి కోరాడ కోరాడ శ్రీనివాస్ బుధవారం దాడి చేశారు. దాడి అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన శ్రీను అక్కడ గందరగోళం సృష్టించాడు. విఆర్‌ఒలు తెలిపిన వివరాల ప్రకారం కంబిరిగాం వద్ద రియల్ ఎస్టేట్‌కు భూములు కొన్నాడు. కంకరను తవ్వి రియల్ ఎస్టేట్ భూముల్లో వేయడం, ఆక్రమణలపై ఒక వ్యక్తి ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై మైన్స్, రెవెన్యూ అధికారులు బుధవారం ఆ భూములను పరిశీలించి కొలతలు వేశారు. ఇందుకు సంబంధించిన నోటీసును శ్రీనివాస్‌కు అందజేసేందుకు వెళ్లిన సమయంలో దాడికి పాల్పడ్డాడని విఆర్‌ఒలు తెలిపారు. దాడి అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన శ్రీనివాస్ అక్కడ చిందులు వేశాడు. తాను ఇంట్లో లేని సమయంలో నోటీసు అందజేయడానికి వచ్చిన విఆర్‌ఒలు తన భార్య పావనికి దురుసుగా ప్రవర్తించారని ఆరోపించాడు. ఈ ఘటనపై విఆర్‌ఒల సంఘం ఆదేశాల మేరకు విఆర్‌ఒలు శ్రీనివాస్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే జిల్లాస్థాయిలో ఆందోళన చేపడతామని విఆర్‌ఒల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ల శ్రావణ్ కుమార్, నాయకులు సంతోష్ హెచ్చరించారు.



విద్యార్థులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విలువలతో కూడిన విద్యనందించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు నేర్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయం అందరికీ అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిందే రాజ్యాంగ దినోత్సవమన్నారు. రాజ్యాంగ ముసాయిదా ప్రతుల తొలి సంతకాల రోజైన నవంబరు 26న జాతీయ న్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే నిరంతరం శ్రమించి కృషి చేయాలన్నారు. అనంతరం తన విద్యాభ్యాసం నుంచి కలెక్టర్ అయ్యేంత వరకు తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రులు మంచి సత్ప్రవర్తనను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. అవసరానికి మించి సెల్‌ఫోన్ వినియోగించకుండా చూసే బాధ్యత తల్లిదండ్రులు తీసుకొని భావి భారత పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పలాస మండలం గరుడభద్ర జెడ్‌పి హైస్కూల్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మెమోంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం



అరసవల్లి : మాట్లాడుతున్న గిరిధర్

ప్రజాశక్తి- అరసవల్లి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గొంటి గిరిధర్ ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి మోహనరావు, సాహితీ స్రవంతి ప్రతినిధి కె.శ్రీనువాసులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే పాలకులు ఎలుతున్నారని అన్నారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ పీఠక బి.ఉమామహేశ్వరరావు చదివి సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అందరి వాడు అంబేద్కరుడు... ఆదర్శమూర్తి అతడు అన్న గేయాన్ని ఎస్.సంజీవరావు ఆలపించారు. కార్యక్రమంలో బి.జనార్ధన్, బి.ధనుంజయ్, కె.కామేశ్వరరావు, వి.శ్రీనివాస్, పి.గోవిందరావు, యు.రాజు, కె.ప్రవల్లిక, భారతి పాల్గొన్నారు.

అరసవల్లి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదాశివుని శంకరరావు ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు చాడ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

శ్రీకాకుళం సిటీ : శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, క్లబ్ ప్రతినిధులు గుడ్ల జగ్గారావు, సుగంధం సంజీవరావు, గేదెల లక్ష్మి, గుడ్ల గోపాలరావు, నాగేశ్వర, ఈశ్వరరావు, కోచ్ రాజీవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, డి.ఫాల్గుణరావు, పి.ప్రసాదరావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ యస్ సత్యనారాయణ, మేరా యువ భారత్ వాలంటీర్లు అరుగుల దిలీప్ కుమార్, మట్ట ప్రియాంక పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగ స్ఫూర్తిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఎంఇఒ కె.ఎరాములు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు పైడి రామస్వామినాయుడు, పీడీ జె.రవిబాబు, అధ్యాపకులు రాజారావు బి.ఎ.శివరాజ్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పైల రవికుమార్, బి.శరత్‌కుమారి పాల్గొన్నారు.

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. తొలిత అంబేద్కర్ చిత్రపటానికి స్థానిక లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ బి.నీలిమ పూలమాలలు వేశారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు రాజ్యాంగ ప్రతిజ్ఞను విద్యార్థులతో చదివించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీలో రేవంత్, స్వాతి, కుసుమలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రాగా, గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పుసుపుల జగన్నాథం ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు పిసిని వసంతరావు, కూన నారాయణబాబు, కోట్ల సూర్యనారాయణ, సంజీవి నళినీసుధాకర్, పక్కి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : తహశీల్దార్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ వెంకటరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డిటి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : దండుగోపాలపురంలో మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

రణస్థలం: అసమానతలను రూపుమాపి రాజ్యాంగ విలువలను కాపాడాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, నియోజకవర్గ వైసిపి బిసి విభాగం అధ్యక్షులు మజ్జి రమేష్, చేతివృత్తిల విభాగం అధ్యక్షులు టేకు బ్రహ్మాజీ, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు ముద్దాడ రాజశేఖర్, మండల ఎగ్జిక్యూటివ్ మెంబరు ఇడదాసుల తిరుపతిరాజు పాల్గొన్నారు.

అలాగే ఎపి దళిత మహాసభ రణస్థలం మండల శాఖ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎపి దళిత మహాసభ మండల అధ్యక్షులు పల్ల నీలయ్య, సీనియర్ నాయకులు దుక్క ఆదినారాయణ, కుప్పిలి పైడిరాజు, నడుపూరి ఆనంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లండ చిన్నబాబు, ఉపాధ్యక్షులు బోనేలా పరశురాం, మామిడి జగదీష్ తదితరులుపాల్గొన్నారు.

మందస: మండలంలోని హరిపురం ప్లస్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఎంఇఒ-1 మర్రిపాటి లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి గోపీచంద్ పాల్గొన్నారు. సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు తేజేశ్వరరావు రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎల్.సాంబమూర్తి, పిజిటి రమణబాబు, పీడీలు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ప్రిన్సిపాల్ ముకళ్ల శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఒ కె.రాము, అధ్యాపకులు రమణమూర్తి, పద్మనాభం, లక్కోజు గౌరీశంకర్ పాల్గొన్నారు.

అలాగే మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటేశ్వర ప్రసాద్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అలాగే ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి పాఠశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో మేనేజ్‌మెంట్ సభ్యులు వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పోగోటి లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, ఎఒ డాక్టర్ ముని రామకృష్ణ ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి, క్యాంపస్ ఇన్‌ఛార్జి వి.సాగర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ .వి.సింహాచలం, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ప్రశాంత్, టి.అసిరినాయుడు పాల్గొన్నారు.

కవిటి: రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమిలియాపుట్టుగ పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. సహలాలపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు లింగరాజ్ ప్రసాద్ పట్నాయక్ రాజ్యాంగ దినోత్సవం రచయితల ప్రాముఖ్యతను చిత్రపటాల రూపంలో వివరిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ త్రినాథ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఇచ్ఛాపురం : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కొత్తశాసనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడి గోపాలరావు విజేతలకు బహుమతులు అందజేశారు.

కొత్తూరు : కొత్తూరులో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మండల దళిత సంఘాల ఆధ్వర్యాన, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిటి మురళీకృష్ణ, వెంకటేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు, ఎంఇఒ శ్రీనివాస్, దళిత నాయకులు టి.తిరుపతిరావు, బి.రామకృష్ణ, పడాలి నాగభూషణరావు పాల్గొన్నారు. అలాగే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని కంబాలరాయుడుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లఖినాన కరుణాకర్ అన్నారు. పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లిసారధిలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గుంట కోదండరావు ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం వేడుకలు నిర్వహించారు.

సంతబొమ్మాళి : మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రెడ్డి సూరిబాబు ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ జలుమూరు చిన్నవాడు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

దండుగోపాలపురం జెడ్‌పి హైస్కూల్‌లో సాంఘిక దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



కవిటి : పెద్దమిలియాపుట్టుగలో మాక్ అసెంబ్లీ

సాంఘిక దినోత్సవం ఆకృతిలో విద్యార్థులు కూర్చుని సాంఘికశాస్త్రంపై ఆసక్తిని ప్రదర్శించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞ అనంతరం 315 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సోషల్ టీచర్ల ఆధ్వర్యాన మాక్ అసెంబ్లీలో విద్యార్థులు స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రుల పాత్రల్లో మెప్పించారు.

బూర్జ : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఓ.వి.పేట బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిడిఒ తిరుపతిరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బుడుమురు సూర్యారావు, సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, టిడిపి మండల అధ్యక్షులు బుడుమూరు సత్యం, బుడుమూరు మురళీధరరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు బొడ్డేపల్లి సూర్యారావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, కేతరామారావు, జనసేన గ్రామ అధ్యక్షుడు చిగురుపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

సోంపేట : రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా జైభీమ్ సేన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జైభీమ్ సేన జిల్లా ఉపాధ్యక్షులు గొలియా ప్రకాశరావు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జైభీమ్ సేన వ్యవస్థాపకులు డాక్టర్ నగిరి మోహనరావు, జిల్లా అధ్యక్షులు బుస్క ఈశ్వరరావు, జాడు తులసయ్య, డిస్క రవిలు పాల్గొన్నారు.


మందస : మాట్లాడుతున్న ఎంఇఒ లక్ష్మణరావు

ఆమదాలవలస : రాజ్యం దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల లక్ష్మీనగర్‌లో మాదిరి ఎన్నికలను నిర్వహించారు. ప్రతి తరగతి నుంచి ఒక విద్యార్థిని లీడర్‌లుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణమ్మ,ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

పొందూరు: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఎంఇఒ పట్నాన రాజారావు, డాక్టర్.ఎం.సునీల్‌కుమార్, పొందూరు ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్.గవర్రాజు, వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జోలీ వాకర్స్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పొందూరు, జి.సిగడాం ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శీర రాము ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రేగడి సతీష్, గౌరవాధ్యక్షులు సాకేటి నాగరాజు, సభ్యులు రాజేష్, లింగరాజు, పోతయ్య, సీతరాజు, సాయి, సతీష్, సంతోష్ పాల్గొన్నారు.

నందిగాం : రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా మండలంలోని శివరాపురం పంచాయతీ బడబందలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బి.నారాయణరావు, బహుజన చైతన్య కళామండలి రాష్ట్ర అధ్యక్షులు ఉదయభాస్కర్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వై.గోపి, బి.మోహనరావు, గిరిజన సంఘ ప్రతినిధి వి.యోగి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడిలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు వివిధ ప్రజాసంఘాలతో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా అదనపు రెవిన్యూ మేజిస్ట్రేట్ మునింద్ర హెూన్నాగాకు వివిధ డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య, జిల్లా కార్యదర్శి కేదార్ సబర్, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం, ఎఐసిసిసిపియు ప్రతినిధి శ్రీను బెహరా, గజపతి జిల్లా మోటారు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింగ మాలభిసోయి, ఎఐటియుసి ప్రతినిధి ఇజ్రాయిల్ మాలి పాల్గొన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టు నిర్ణయాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కార్గో ఎయిర్ పోర్టు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. మండలంలోని చీపురుపల్లి పంచాయతీ సంతోష్ నగర్‌లో కార్గో ఎయిర్ పోర్టు బాధిత రైతులతో గ్రామ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జోగి సంతోష్, గుంటి తుంబనాథం ఆధ్వర్యంలో నల్ల రిబ్బనలతో బుధవారం నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ నెల 18న నిర్వహించిన మహాధర్నను పోలీసులు అడ్డుకోవడంతో ఈ నెల 21 నుంచి 26 వరకు గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. శాంతియుతంగా పోరాటం చేస్తున్నా ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అధికారుల తీరును ఖండిస్తున్నామన్నారు. బాధిత రైతులు చేస్తున్న ప్రజా పోరాటంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటి గంగ, దాసరి పూర్ణమ్మ, పొట్టి పార్వతి, గుంటి ఎల్లమ్మ, సండూపల్లి ఢిల్లీరావు, బైపల్లి హరినాథ్, సండూపల్లి ఉమాపతి పాల్గొన్నారు.


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం!

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలో అక్రమ కట్టడాలు జోరుగా కొనసాగుతున్నాయి. నిరోధించాల్సిన అధికారులు తమ వంతు సహకారం అందించడంతో నిర్మాణదారులు వెనుక్కు తగ్గే ప్రసక్తే లేదని అంటున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు మాత్రం తీసుకునేందుకు అధికారులు ఎటువంటి సాహసం చేయడం లేదు. రెవెన్యూ, పంచాయతీ అధికారులకు అక్రమ కట్టడాలు కాసులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో అనాధికార నిర్మాణాలకు అధికారులు సంపూర్ణ సహకారం అక్రమ భవన నిర్మాణదారులకు రాజమార్గమైంది. అదనపు అంతస్తులతో నిర్మాణాలు శరవేగంగా జోరుగా సాగుతున్నాయి. నోటీసులు ఇచ్చామని కొంతమంది, ప్రభుత్వ స్థలమే గాని అన్ని అనుమతులు ఉన్నాయని ఇంకొంతమంది, సూడా పరిధిలోకి వస్తుందని మరి కొంతమంది అధికారులు పక్కకు తప్పుకుంటున్నారు. అక్రమ నిర్మాణదారుల నుంచి వసూలు శరవేగంగా సాగుతున్నాయి. ఇందిరానగర్, మారుతీనగర్, ప్రధాన రహదారి ప్రాంతంలో అదనపు భవంతుల నిర్మాణాలకు అక్రమ నిర్మాణాలకు అధికారుల సహకారం భారీ స్థాయిలో ఉంది. రసన్నపేట పరిధిలోని అధికారుల పనితీరుపై స్థానికులు ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు.

బడా బిల్డింగ్ నిర్మాణదారులకు సహకారం

అనుమతి లేని అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్తులు నిర్మిస్తున్న వారికి మాత్రం, అన్ని విధాలా సహకరిస్తున్న మేజర్ పంచాయతీ అధికారులు, చిన్న నిర్మాణాలు చేస్తున్న వారిపై తమ ప్రతాపం చూస్తున్నారు. నిర్మాణాలను విరగొట్టడం, వారి మెటీరియల్ తీసుకొనిపోవడం, వారి మీదకి సిబ్బందిని పంపించడం చేయడం విడ్డూరంగా ఉంది. అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తుంది. ఒకరికి సహకారం మరొకరికి అధికారం ప్రకటించడం పట్ల అధికారుల ద్వంద్వ వైఖరి కనిపిస్తుంది.


నిర్మిస్తున్న అంతస్తుల భవనం

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూండి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం సంభవించిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. విధి నిర్వహణలో ఉన్న గ్యాంగ్‌మన్ ఉదయం ఆరు గంటల సమయంలో పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు. స్టేషన్ మాస్టర్ పలాస జిఆర్‌పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేసుకున్న పోలీసులు మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి, లైట్ బ్లూ కలర్ జీన్ పాంట్, జిప్‌తో ఉన్న ఫుల్ హ్యాండ్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని అన్నారు. తల భాగం పూర్తిగా ఛిద్రమవడంతో గుర్తు పట్టడానికి వీలులేకుండా పోయిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని జిఆర్‌పి ఎస్ఐ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

పోరాట యోధుడు కనకాచలం


విగ్రహాల వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రజలు, కష్ట జీవులు సమస్యలతో సతమతమయ్యే పరిస్థితిలో శ్రమజీవుల తరుపున పోరాట మార్గంలో పయనించడమే నిజమైన నివాళి అని సిపిఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. మండలంలోని తలగాంలో హనుమంతు కనకాచలం, కౌసల్య 15వ వర్ధంతి సభ వెంకునాయుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా సిఐటియు కమిటీలో ఉంటూ ఉద్యోగ, కార్మికుల సమస్యలపైన, పేద ప్రజల తరుపున పలు పోరాటాల్లో పాల్గొన్నారని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, బగాది వాసుదేవరావు, హనుమంతు ఉదయ భాస్కర్, హనుమంతు పద్మాకర్ లు సభను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. బియ్యం, డబ్బులు కొన్ని పేద కుటుంబాలకు పంచిపెట్టారు. జోహార్ కనకాచలం, కనకాచల ఆశయాలను కొనసాగిస్తామని సిఐటియు నాయకులతో పాటు అందరూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు

రాష్ట్రస్థాయి ఖోఖోకి డొంకూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం: రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14 స్కూల్ గేమ్స్ పోటీలకు డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి ఆధ్వర్యాన బుధవారం అభినందించారు. ఖకాకుళం జిల్లా ఆర్ట్స్ కళాశాల వేదికగా ఇటీవల నిర్వహించి జిల్లాస్థాయి అండర్-14 బాల బాలికల స్కూల్ గేమ్స్ ఖోఖో ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో బాలురు విభాగం నుంచి బి.కార్తీక్, డి.శరత్, డి.గణేష్, సిహెచ్.కార్తీక్, డి.హేమంత్, అండర్-14 బాలికల విభాగం నుంచి కోకిల ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28 నుంచి 39 వరకు అనకాపల్లి జిల్లా లంకపాలెం వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు పాల్గొంగారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.జానకిరావు, ఉపాధ్యాయులు వెంకటరమణ, శంకర్‌రెడ్డి, కమలాకరరావు, గోవిందరావు, నూకయ్య, పద్మావతి, సువర్ణ, రాఘవేంద్ర, ఈశ్వరరావు శేషాద్రి, గంగావేని, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు

వజ్రపుకొత్తూరు : ఆరుతడి పంటలతో మేలైన రకాల ఎంపిక ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు అన్నారు. మండలంలోని పాతటెక్కలి, చీపురుపల్లి గ్రామాల్లో జిల్లా వనరులు కేంద్రం ఆధ్వర్యాన ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రైతులకు పెసర, మినుములు, నువ్వులు, వేరుశెనగ పంటలపై అధిక దిగుబడులు పొందడానికి మేలైన యాజమాన్య పద్ధతులు గురించి అవగాహనా కల్పించారు. ముఖ్యంగా అపరాల్లో రకాల ఎంపిక, ఎరువులు యాజమాన్యం, చీడ పీడలు యాజమాన్యం, వేరుశెనగలో జిప్సం వేయుట వల్ల ఉపయోగం, నువ్వు పంటలో రకాలు ఎంపిక, నీటి యాజమాన్య పద్ధతులు గురుంచి వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్, ఎఒ బమ్మిడి ధనంజయ, వ్యవసాయ సహాయకులు వై.పూజ, జె.సమీరా పాల్గొన్నారు.


అవగాహన కలిగిస్తున్న శాస్త్రవేత్తలు


ఆలయంలో ఉన్న కొండచిలువ

వామ్మో.... కొండచిలువ

బూర్జ: మండలంలోని అల్లిన పంచాయితీ పరిధిలోని కిలాంతరిలో భారీ కొండచిలువ హలోచల్ చేసింది. బుధవారం రాత్రి నిర్వహిస్తున్న గ్రామ దేవత అమ్మవారి ఆలయంలో ఈ భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. ఆలయంలోకి వచ్చిన యాత్రిలు కొండచిలువను చూసి భయాందోళనలకు గురయ్యారు. సుమారు మూడు గంటల పాటు కొండచిలువ ఆలయం లోపలే ఉండడంతో గందరగోళ పరిస్థితులను నెలకొన్నాయి. భారీ సర్పాన్ని చూడ్డానికి గ్రామస్తులు తరలివచ్చారు. భారీ సర్పాన్ని హతమార్చడానికి ఎవరూ సాహసం చేయలేదు. అయితే రాత్రి వేళలో ఆ సమయంలో ఎవరి ఇంట్లోకి వస్తుందోనని భయం గుప్పెట్లో గడుపుతున్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తండ్యాం పంచాయతీ బొట్లపేటలో గ్రామానికి చెందిన మేకా కిరణ్‌చందు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం కలుషితమైన తాగునీరును వినియోగించడమేనని, ప్రతిఒక్కరూ మినరల్ వాటర్‌ను వినియోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రేపు లావేరు మండల సమావేశం

లావేరు : ఈ నెల 29న లావేరు మండల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ పేడాడ వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు విధిగా, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

రెండు దూడలు జననం

లావేరు: లావేరు పంచాయితీ కేశవరాయపురంలో కొర్రాయి సూరిబాబు అనే రైతుకు చెందిన ఆవు రెండు దూడలకు బుధవారం జన్మనిచ్చింది. మధ్యాహ్నం 4 గంటల సమయంలో ఒకటి, 4.30 గంటలకు మరొకటి ఒకే కాన్పులో జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న గామస్తులు దూడలను చూసేందుకు తరలివచ్చారు.


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు


'ఐతమ్'లో ఆన్‌లైన్ ఎఫ్‌డిపి ప్రారంభం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

టెక్కలి రూరల్ : టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ) విభాగాధిపతి డాక్టర్ వై.రమేష్ ఆధ్వర్యాన 'క్వాంటం కంప్యూటింగ్, ఎంఎల్ అనే అంశంపై జాతీయ స్థాయి ఏడు రోజుల ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభమైందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఆధునిక సాంకేతిక రంగంలో వేగంగా విస్తరిస్తున్న క్వాంటం కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్ వంటి విభాగాల్లో అధ్యాపకులు సిద్ధంగా ఉండేలా ఐతం కళాశాల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన నిపుణులు ఈ కార్యక్రమంలో వనరుల వ్యక్తులుగా పాల్గొంటున్నారు. ఆధునిక క్వాంటం సాంకేతికతలు, పరిశోధనా అవకాశాలు, ప్రాజెక్టు రూపకల్పన వంటి అంశాలపై పాల్గొనే అధ్యాపకులకు లోతైన శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ పాండురంగ వైటల్, సిఎస్ఇ విభాగాధిపతి వ్యవహరిస్తున్నారు. డాక్టర్ చి.రమేష్, డాక్టర్ ఉమాప్రసాద్ సమన్వయకర్తలుగా పనిచేస్తున్నారు.

సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఆధ్వర్యాన పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల అమలు, పారదర్శకత, ప్రజా సేవల తదితర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు కీలకమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, కార్యదర్శులు డి.వాసుదేవరావు, శివాజీ, ఢిల్లీరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు



అవగాహన కల్పిస్తున్న తవిటినాయుడు

బూర్జ : దుక్కుదున్న కుండా మొక్కజొన్న సాగు చేయవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని రైతులు గత మూడేళ్లుగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్‌తో మొక్కజొన్న యాంత్రీకరణ పద్ధతి ద్వారా సాగు చేస్తున్నామని అన్నారు. ఈ డబల్ వీల్ మార్కర్ ద్వారా మొక్కజొన్న సాగు తక్కువ ఖర్చుతో దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. పది రోజులు ముందుగానే పంట చేతికి పొందుతామన్నారు. ఇంకా రూ.5 వేలు వరకు ఖర్చులు తగ్గుతూ రెండు తడుల నీటిని ఆదా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు దేవాది ఏసు, మొయ్యి ఈశ్వరరావు పాల్గొన్నారు.


మృతి చెందిన గొర్రెలు, మేకలు

ట్రాక్టర్ ఢీకొని 11 గొర్రెలు, మేకలు మృతి

పర్లాకిమిడి : పర్లాకిమిడి సమీపం ఖరడ వద్ద బుధవారం ట్రాక్టర్ ఢీకొని 11 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గజపతి జిల్లా కాశీనగర్ సమితి సిద్ధమనుగు పంచాయతీ నీళకంఠానికి చెందిన పిట్ట కృష్ణ తనకు చెందిన మేకలు, గొర్రెలను ఖరడ వద్ద మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో పర్లాకిమిడికి చెందిన ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీని విలువ రూ.లక్షల వరకు ఉంటుందని కాపరి కృష్ణ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ నిలుపుదల చేయకుండా వెళ్లిపోవడంతో యాదవుల సంఘం మండల అధ్యక్షులు అంకబోయిన కులవర్ధన్, పెద్దలు రాణిపేట వద్ద ఆ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని నుంచి బాధితుడికి రూ.35 వేలు నష్టపరిహారం ఇప్పించారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని నిమ్మడ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మడ, చిన్నబమ్మిడి, పెద్దబమ్మిడి, వాంగ్రాడ, ఎత్తురాళ్లపాడు, గట్లపాడు, తులసిపేట, చవితిపేట, చిట్టివలస, హరిశ్చంద్రపురం, రాజపురం, నర్సింగపల్లి, వెంకటాపురం, పంతులపేట, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సరుబుజ్జిలి : మండలంలోని రొట్టవలస విద్యుత్ పీడరు పరిధిలో ఈ నెల 28న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఇఇ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సరుబుజ్జిలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రొట్టవలస 11 కెవి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ భాగంగా చెట్ల కొమ్మలు తొలగిస్తామన్నారు. అందుకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిన్నపాలెం, పెద్దపాలెం, రావివలస, పాలవలస, పెద్దవెంకటాపురం, పురుషోత్తపురం, సీతారాంనగర్, అలమాజీపేట, పకీర్‌సాహెబ్‌పేట, చెవ్వకులపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలాస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతానికిపైగా మార్కులతో పూర్తిచేసి ఉండాలన్నారు. నెట్, ఎపిసెట్, పిహెచ్‌డి వంటి అదనపు అర్హత ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 29న డెమో, ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు.



ఎస్‌పిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు

రోగికి ప్రేమతో వైద్యం అందించాలి

శ్రీకాకుళం రూరల్: రోగికి ప్రేమతో వైద్యం అందేలా చూడాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సూచించారు. మండలంలోని రాగోలులో ఉన్న జెమ్స్ ఆస్పత్రిలో బుధవారం 15వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో వైద్య రంగానికి గుర్తింపు తెచ్చిన ఆస్పత్రి జెమ్స్ అని కొనియాడారు. అనంతరం వారికి జెమ్స్ అధినేత బుల్లినేని భాస్కరరావు సన్మానించారు. విద్యార్థులు చేసిన సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి వైద్యులు సుధీర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేద్దాం

రణస్థలం: ప్రకృతి వ్యవసాయం చేసి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుదామని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త పెద్దింటి రాజేశ్వరి రైతులకు సూచించారు. మండలంలోని తిరుపతిపాలెంలో రైతన్న మీకోసం అనే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వరుణ్ సమక్షంలో కందుల రమేష్ అనే రైతు ఆరు ఎకరాల కొబ్బరి తోటకు గత రెండేళ్ల నుంచి ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. అందులో భాగంగా వెయ్యి లీటర్ల ద్రవ జీవామృతాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిన సాధిస్తారని సూచించారు.

రైతులపై ప్రత్యేక శ్రద్ధ



కవిటి : పోస్టర్‌ను అందిస్తున్న విప్ అశోక్



కొత్తూరు : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- కవిటి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రాజపురంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాబోయే కాలంలో అమలు చేయనున్న కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. గ్రామాల్లో రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న బ్రోచర్ అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీమోహన్, ఎఒ పిరియా శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర, ప్రకాష్ పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, జెడ్‌ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస రౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, పుల్లట సంతోష్, బాసుదేవ్ రౌళో పాల్గొన్నారు.

మెళియాపుట్టి: వ్యవసాయ, అనుబంధశాఖ అధికారుల సూచనలు, సలహాలు రైతులు ఎప్పటికప్పుడు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. మండలంలో పెద్దపద్మాపురంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, పశువైద్య సహాయకుడు సంపత్‌కుమార్, మహిళా పోలీస్ శ్రావణి, ప్రకృతి వ్యవసాయ కార్యకర్త కృష్ణవేణి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోగల తిలారు, చౌదరి కొత్తూరు గ్రామాల్లో ఎఒ ఎస్.గోవిందరావు రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకుడు నాళ్ల ఆదినారాయణ (చిన్ని), ఎం.మాధవి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్రలో నిర్వహించిన రైతన్న మీ కోసంలో రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ కావడంతో కృతజ్ఞతగా చంద్రబాబు నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, వజ్జ ప్రభాకర్, సాయిరాజు, హరిబాబు, సన్యాసిరావు, కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ధర్మారావు పాల్గొన్నారు.

పొందూరు: రైతులు తమ ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకునేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని లోలుగులో నిర్వహించిన రైతన్న మీకోసంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వ్యవసాయ సాగులో రైతులు అవలంబిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళి, ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, ఎఒ ఎం.శ్రీనివాసబాబు, విఎఎ సౌజన్య, కూటమి నాయకులు లోలుగు కామరాజు, శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, చలపతిరావు, సింహాచలం పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కురిగాంలో నిర్వహించిన రైతన్న మీకోసంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని రైతులకు వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఆర్‌డిఎస్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఎ.అరుణ్‌కుమార్, ఎంఎఒ స్వర్ణలత, ఇఎంటి సూర్యనారాయణ, గోవింద్, ఐసిఆర్‌పిలు ధనలక్ష్మి, వెంకట్, కేశవ, పూనమ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : రైతు సేవలో మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు సిహెచ్.బాలకృష్ణ, వి.హరికుమార్ అన్నారు. మండలంలోని ఫైలాడ, చిట్టివలస గ్రామాల్లో ఎఒ మెట్ట మోహనరావు ఆధ్వర్యాన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టివలస సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ పూజారి శారద, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, పశుసంవర్థక సహాయకులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని కాలపర్తి పంచాయతీ సుంకరపేటలో నిర్వహించిన రైతన్న మీకోసంలో టిడిపి నాయకులు కోరుకొండ రామనాయుడులు పాల్గొని రైతు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి

బూర్జ: వచ్చే ఏడాది నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని ఎపి ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ యశోదలక్ష్మి సూచించారు. మండలంలోని కొల్లివలస లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే కాన్స్టిట్యూషనల్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోని భవనాలను, నూతనంగా కలెక్టర్ ఆమోదించిన అధునాతన వంటశాల నిర్మాణం కోసం డైరెక్టర్ ఎపిఇడబ్ల్యుఐడిసి పి.ఎం.జె.బాబుతో తనిఖీ చేశారు. అనంతరం పిల్లలతో పాటు కలసి భోజనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

కవిటి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం పరామర్శించారు. కవిటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాండవ కిరణ్, భైరిపురానికి చెందిన కొర్రాయి ధనుంజయం, పూడి కామేశ్వరరావు, చిన్నకర్రివానిపాలెం గ్రామానికి చెందిన చీకటి సీమారావు, జగతి గ్రామానికి చెందిన బార్ల జగన్నాథం భార్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిరియా ఆయా కుటుంబ సభ్యులను కలుసుకుని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ప్రాంగణంలో హుండీలు 60 రోజుల ఆదాయం లెక్కించగా రూ. 6.91.975లు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖాధికారులు, సమక్షంలో విప్పి లెక్కించారు. కార్యక్రమంలో రావివలస ఇఒ జి.గురునాథ్, ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ గోవిందరావు, సభ్యులు మంచాల వెంకటరావు, దేవాది లక్ష్మణరావు పాల్గొన్నారు.

కోటేశ్వర...

అరసవల్లి : ఏడు రోడ్ల కూడలి సమీపంలోని గుడివీధిలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో నారాయణ తిరుమల ఇఒ కె.సర్వేశ్వరరావు ఆధ్వర్యాన బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 42 రోజులకు గాను రూ.2,64,532 ఆదాయం వచ్చినట్టు ఇఒ మునగవలస సుకన్య తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి, ఆలయ ధర్మ పాలక మండలి చైర్మన్ పి.దేవేంద్రనాయుడు, జి.శివరామరాజు, కె.రమేష్, కె.కమల, పి.అమరవాణి పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వంతో భరోసా

బూర్జ : జనసేన క్రియాశీలక సభ్యత్వంతో భరోసా కలుగుతుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసి ప్రాణాలు కోల్పోయిన క్రియాశీలక జనసైనికుల కుటుంబ కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. వారికి భరోసా కల్పించేందుకు బుధవారం తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో జనసేన ప్రధాన కార్యదర్శులు కె.నాగబాబు, తమ్మిరెడ్డి శివశంకర్, రామ్ తాళ్లూరిల సమక్షంలో ఒక్కొక్క కుటుంబానికీ రూ.5 లక్షలు చొప్పున చెక్కును అందజేశారు. మండలంలోని మదనాపురానికి చెందిన ఈపు పార్వతమ్మ కుమారుడు దుర్గారావు, జనసేన వాలంటీర్ మణికంఠ చెక్కును అందజేశారు.



చెక్కును అందజేస్తున్న నాగబాబు



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వం పేదలకు నిలుస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో నువ్వలరేవు మత్స్యకార కుటుంబానికి చెందిన బైనపల్లి గురువాదికి రూ.43,727 సిఎం సహాయనిధి చెక్కును బుధవారం అందజేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలను ఆదుకోవడానికి సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో 31వ యూనిట్ కన్వీనర్ కదంబాల వెంకటరమన, నువ్వలరేవు 229 బూత్ కన్వీనర్ బైనపల్లి లోకనాథ్ బెహరా, 230 బూత్ కన్వీనర్ బైనపల్లి కొండలరావు పాల్గొన్నారు.

అలరించిన గానామృతం

అరసవల్లి: ఆరామ ద్రావిడ సంఘం, సుమిత్ర కళా సమితి ఆధ్వర్యాన బాపూజీ కళామందిర్‌లో ఇప్పిలి జోగారావు 102వ జయంతి వేడుకలు వేడుకలు నిర్వహించారు. సందర్భంగా కేరళకు చెందిన విష్ణుదేవ్ నంబూర్థి గానామృత కార్యక్రమం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. సుస్వర గానామృతంలో మావుడూరు సత్యనారాయణ శర్మ వయోలిన్, వంకాయల వెంకటరమణ మృదంగం, బెంగళూరుకు చెందిన గురు ప్రసన్న కంజీర వాయిద్య సాకారం ఎంతగానో అలరిం చింది. ఈ సందర్భంగా కళాకారులు బొంతలకోటి కృష్ణారావుకు, వరదా దుర్గరాజులకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రేపువేమకోటి సూర్యనారాయణ శర్మ, ఇప్పిలి జోగి సన్యాసి రావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, భాస్కర్‌భట్ల శ్రీరామ శర్మ, బంకుపల్లి వెంకటరమణమూర్తి, ఇప్పిలి శంకర్‌శర్మ పాల్గొన్నారు.